క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్ : మండలంలోని దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని సోమవారం అర్చకులు నాగోజు మల్లాచారి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దివ్యదర్శనం చేసుకొని మొక్కుబడి కల్యాణాలు చేయించారు. ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టారు. వేప, రావి కొమ్మలకు ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది గాలి నాగేశ్వర్ రావు, ఉపేందర్ రెడ్డి, అంజనేయులు గౌడ్, రాజయ్య, నాగరాజు, పాల్గొన్నారు.

17న మున్సిపల్ మడిగల వేలం

చండూరు : ఈనెల 17న మున్సిపల్ మడిగలకు వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ మల్లేషం సోమవారం ప్రకటనలో తెలిపారు. 3,4,12,15 నంబర్ గల మడిగల వేలంలో పాల్గొనే వారు ఒక్కో మడిగకు రూ.50వేల ఏదేని బ్యాంకు నుంచి డీడీ తీసి, రూ.2వేలతో ఫారం తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 15వ తేదీ దరఖాస్తుకు చివరితేదీ అని, వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

రామగిరి(నల్లగొండ) : సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రించవచ్చని డిఎస్పీ శివరాం రెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగ్‌భట్ల గ్రామంలో సోమవారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంతో పాటు ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు సహాయపడుతున్నాయన్నారు. నేరస్తులను గుర్తించడంలో ఉపయోగపడుతాయన్నారు. ప్రజలందరూ తమ ఇళ్లు, దుకాణాలు ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాఘవరావు, ఎస్ఐ సైదా బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యుత్ మోటారు చోరీ

నకిరేకల్ : మండలం చందంపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని నీటి సంప్‌లో ఉన్న విద్యుత్ మోటారును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక పాఠశాల హెచ్ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి సోమవారం పాఠశాలకు వచ్చి చూసే సరికి విద్యుత్ మోటార్ లేకపోవడంతో చోరీకి గురైందని గుర్తించి స్థానికులకు సమాచారం అందించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు విడుదల చేయాలి

నల్లగొండ టౌన్ : బెస్టు అవైలబుల్ స్కీమ్ కింద చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన నిధులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖంబంపాటి శంకర్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో 1650మంది విద్యార్థుల బకాయిలు రూ. 11కోట్లు విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు.

పోషణ మాసోత్సవం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిట్యాల : మండలంలోని నేరడ గ్రామంలో ఐసీడీయస్ ఆధ్వర్యంలో పోషణమాసోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనతకుగాను తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను వివరించారు. పరిశుభ్రతను పాటించటంతో పాటు హ్యాండ్ వాష్ గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం విజయ, అంగన్వాడీ టీచర్‌లు ఆలివేలు మంగమ్మ, సుజాత, నాగరాణి, ఆశా వర్కర్‌లు సైదమ్మ, వసంత, నాగమణి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

చిట్యాల : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు పీక వెంకన్న కోరారు. సోమవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహ, మండల ప్రధానకార్యదర్శి విష్ణు, మండల ఉపాధ్యక్షుడు ఆకుల వెంకన్న, నర్సింహ, లింగస్వామి, నర్సింహ, అనిల్ పాల్గొన్నారు.

పెరిగిన గ్రామీణ ఓటర్లు

- 2019 ఎన్నికలతో పోల్చితే 36,126 ఓట్లు అధికం
- పురుషుల కంటే 2,278 మంది మహిళా ఓటర్లు ఎక్కువ
- నగం స్థానాలు మహిళలకే..

నకిరేకల్ : గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే విడులైంది. ఇక ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు తమ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికలతో పోల్చిచూస్తే నకిరేకల్ నియోజకవర్గవ్యాప్తంగా ఈ సారి గ్రామీణ ఓటర్లు పెరిగారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు ఉపాధి, పిల్లల చదువులకు వలసలు పెరిగిన తమ సొంత ఊళ్లల్లో తమ ఓటు ఉండేలా చూసుకుండటంతో పల్లె ఓటర్ల సంఖ్య గతం కంటే పెరగడం గమనార్హం నకిరేకల్ మండలంలో ఏడు పంచాయతీలకు అప్పుడు ఎన్నికలు జరగలేదు. నేడు వాటికి కూడా ఎన్నికలు నిర్వహిస్తుండటంతో ప్రస్తుతం నకిరేకల్ మండలంలో గత ఎన్నికంటే ఓటర్ల సంఖ్య అధికంగా నమోదైంది. ఓటర్లలో సగం అంత కంటే మహిళ ఓటర్ల సంఖ్య అధికంగానే ఉంది. 2019ఎన్నికల్లో నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు కేవలం 730మంది తక్కువగా ఉండగా ప్రస్తుతం ఎన్నికల్లో పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 2,278మంది అధికంగా ఉన్నారు.



కడపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం

నియోజకవర్గ వ్యాప్తంగా ఇలా..

2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల కంటే ప్రస్తుతం 2025లో స్థానిక ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లు 36 126 మంది ఓటర్లు పెరిగారు. 2019లో నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాల్లో రెండు నకిరేకల్, చిట్యాల మున్సిపాలిటీలు మినహిస్తే మొత్తం 126 గ్రామ పంచాయతీల్లో 1,84,024 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు-92, 377, మహిళలు - 91,647 మంది ఉన్నారు. తాజాగా స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ప్రకటించిన తుది ఓటర్ల జాబితా పరిశీలిస్తే.. నియోజకవర్గ వ్యాప్తంగా 2,20150 మంది ఉన్నారు. వీరిలో పురుషులు-1,08,936, మహిళలు -1,11,214 మంది నమోదై ఉన్నారు.

మండలాల వారీగా మొత్తం ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
నకిరేకల్	13,283	13,558	26,843
కట్టంగూర్	18,565	18,797	37,362
కేతేపల్లి	15,136	15,947	31,084
నార్కట్‌పల్లి	21,508	22,263	43, 772
చిట్యాల	17,760	17,975	35,735
రామన్నపేట	22,684	22,674	45,358

691స్థానాలు మహిళలకు రిజర్వు

స్థానిక ఎన్నికల్లో మహిళలు 50శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుండటంతో నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో సగం మహిళలకే దక్కనున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు కలిపి మహిళలకు 691 స్థానాలు రిజర్వు అయ్యాయి. నకిరేకల్ మండలంలో 92, కట్టంగూర్ మండలంలో 119, కేతేపల్లి మండలంలో 93, నార్కట్‌పల్లి మండలంలో 152, చిట్యాల మండలంలో 103, రామన్నపేట మండలంలో 132 స్థానాలకు చొప్పున మహిళలకు కేటాయించారు. పలు జనరల్ స్థానాల్లో మహళలు పోటి చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

శాలిగౌరారం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీకి చెందిన ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామంలో సోమవారం మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి, మనిమద్దె, తిరుమల రాయునిగూడెం గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కిశోర్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసానికి గురిచేసిందన్నారు. దీంతో కాంగ్రెస్‌పాలనపై అసంతృప్తితో ఉన్న ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు. అందుకే బీఆర్ఎస్ పాలనను గుర్తుచేసుకొని చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, నాయకులు కట్ట వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాసులు, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, జేరిపోతుల చంద్రమౌళి, నగేశ్, సత్యం, యాదయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

- నల్లగొండ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజారులో నాళాకు దగ్గరగా నిర్మాణాలు చేపడుతున్న ప్రహరీని పోలీస్ బందోబస్త్‌తో వెళ్లి మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రకాశం బజారులో చోటు చేసుకున్న ఆక్రమణ వ్యవహారంపై ఇరువురు డాక్యుమెంట్‌లను టౌన్‌ప్లానింగ్ అధికారులకు చూపించాలని సూచించారు. ఇష్టానుసారంగా ఎవరైనా నిర్మాణాలు చేపట్టినా సహించేదిలేదని, నాలా ఆక్రమణకు సంబంధించి నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఎక్కడ పడితే అక్కడ నిర్మాణాలు చేపట్టరాదని నిర్మాణదారులకు సూచించారు. నాలా ఆక్రమిస్తే వరదలు వచ్చినప్పుడు ఇళ్లలోకి, దుకాణాల్లోకి వరద నీరు చేరి అందరూ నష్టపోతారన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏసీపీ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

బీఆర్ఎస్‌లో చేరిక

నకిరేకల్ : నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో మొగిలి వెంకన్న, మొగిలి రావు, మునుపాటి వెంకన్న, నిమ్మల గురువయ్య, మేడి నాగరాజు, మొగిలి నాగయ్య, బండమీది మదర్, మేడ చంద్రయ్య, బండమీది అంజనేయులు, మేడి నాగరాజు, మేడ వెంకన్నతో పాటు మరి కొంత మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు గోర్ల వీరయ్య, దైద పరమేష్, చెనగాని జానయ్య, బంటు రవి, యర్కల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న తాటికల్ నాయకులు

మెరుగైన వైద్యం అందించాలి



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్మికురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండ టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆస్పత్రి కాంట్రాక్టు వర్కర్ యూనియన్ అధ్యక్షురాలు ఎల్లమ్మకు మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ అరుణకుమారిని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సరైన వైద్యం అందించి త్వరలో కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ అరుణకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ నగేష్,పల్లా దేవేందర్‌రెడ్డి, బడిగెల వెంకటేష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్ : సోషల్ వెల్ఫేర్ గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు ఇవ్వకపోతే నిరవదిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెడరేషన్ జిల్లా కార్యదర్శి పెరుమాల్ల సత్యనారాయణ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

త్వరలో దళిత కులాల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టౌన్: అంబేడ్కర్ ఆశయాలను పరిపూర్ణం చేసేందుకు దళిత కులాల ఆత్మీయ సమ్మేళనం, 'అంబేడ్కర్ వారసుల అలయ్ బలాయ్' కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నట్లు మహనీయుల ఆశయ సాధన సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ పెరిక కరణ్ జయరాజ్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత కులాలకు జరుగుతున్న నష్టాలను నివారించేందుకు దళితులంతా ఏకం కావల్సిన అవసరం ఉందన్నారు. విడిపోతే నష్టం జరిగే అవకాశం ఉన్నందున దళిత సంఘాలన్ని ఐక్యం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కత్తుల షన్ముకకుమార్, జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, సంఘాల నాయకులు నజీర్, అభిమన్యు శ్రీనివాస్, గోలి సైదులు, కత్తుల తులసిదాస్, వంటిపాక యాదగిరి, అద్దంకి రవీందర్, కొండేటి వెంకట్, చింత శివరామకృష్ణ, ఇరిగి ప్రసాద్, పెరిక అంజయ్య, కత్తుల సన్ని, విజయ్, కాశినాథ్, సందీప్, స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహనీయుల ఆశయ సాధన కమిటీ రాష్ట్ర కన్వీనర్ కరణ్‌జయరాజ్

ముగిసిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



కార్మికురాలిని సన్మానిస్తున్న డీఎం సువీన్‌కుమార్

నల్లగొండ : ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ నల్లగొండ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ సఫాయి కార్మికులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ, పార్కులు, తదితర బహిరంగ ప్రదేశాలను శుభ్రపరచడం, సఫాయి కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన సంస్థ ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ప్రసాద్, కృష్ణవేణి, ఆదిమళ్ల శంకర్, కాశీరెడ్డి, భాస్కర్, సునంద, సరిత, స్వాతి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: తెలంగాణ మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలను ఈనెల 26, 27 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రంహీపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలె సత్యనారాయణ తెలిపారు. సోమవారం దొడ్డి కొమురయ్య భవన్‌లో మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా 500మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పానగంటి లక్ష్మమ్మ, యాదమ్మ, అల్లి అనురాధ, కిన్నెర సైదమ్మ, అంజమ్మ, శంకరమ్మ, పుష్పలత, ఇందిర, ధనమ్మ, లక్ష్మి, కళమ్మ, రేణుక, వెంకటమ్మ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామంలోని వేణుగోపాలస్వామి వార్షిక బ్రహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అలయ అర్చకులు స్వస్తివాచకం, మంటపారాధన, గణపతిపూజ, ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పాల్గొన్న వారికి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మెడబోయిన లింగయ్య భక్తులు పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



విద్యార్థులకు యువ వికాస్‌పై అవగాహన కల్పిస్తున్న ఇంపాక్ట్ ట్రైనర్ ప్రవీణ్‌కుమార్

కట్టంగూర్ : విద్యార్థులు విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇంపాక్ట్ మోటివేషన్ ట్రైనర్ దెండె ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ వికాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్‌ను నిత్య సాధన చేయడంతో మెరుపడుతారని తెలిపారు. దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందన్నారు. యువత మానసికంగా, శారీరకంగా, సామాజిక ఎదుగుదలకు యువ వికాస్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పఠనం, క్రీడలు, సేవా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి యువ వికాస్‌లో భాగమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంబటి అంజయ్య, లయన్స్ క్లబ్ ఉపాధ్యాక్షులు రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి రాములు, ఉపాధ్యాయులు కొంక ఆంటోని, చిన్ని శ్రీనివాస్, విఠల్, ఎండీ అబ్దుల్ గఫార్ ఉన్నారు.

ఏకమయ్యారు.. కుక్కలను తరలించారు

- గ్రామ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో కుక్కల పట్టివేత
- వాట్సప్ గ్రూప్ ద్వారా నిధుల సేకరణ

మునుగోడు : గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ మనుషులపై దాడులు చేస్తున్నాయి. మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామంలో కొన్ని నెలలుగా కుక్కలు ఆ గ్రామంలోని దాదాపు పదిమందిపై దాడికి పాల్పడ్డాయి. దీంతో ఆ గ్రామంలోని యువకులంతా ఏకమై తమ గ్రామంలోని వీధి కుక్కలను నియంత్రించాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం ప్రభుత్వ అధికారులను ఆశ్రయించారు. కానీ ఆ అధికారులు తాము ఏమీ చేయలేమని, వాటి నియంత్రణకు అవసరమైన ఖర్చులకు ఎలాంటి నిధులు లేవని తేల్చి చెప్పారు. దీంతో ఆ గ్రామ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు అంతా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని అందులో వీధి కుక్కల పట్టివేతకు ఎవరి శక్తి మేర వారు ఆర్థిక సాయం అందించాలని కోరారు. అందుకు స్పందించిన గ్రామస్తులు ఒక్కొక్కరు రూ.500నుంచి రూ.1500వరకు అందించగా సుమారు రూ45వేల వరకు పోగు చేశారు. ఆ నగదుతో వీధి కుక్కలు పట్టుకునే నైపుణ్యం కలిగిన వ్యక్తులను రాప్పించి రెండు, మూడు రోజులగా ఆ కుక్కలను పట్టించారు. అనంతరం వాటిని ఓ ప్రత్యేక వాహనంలో యాదాద్రి భువనగిరి జిల్లాలలోని రాచకొండ అడవుల్లో వదిలేశారు. దీంతో ఇప్పటి వరకు దాదపు 80 శాతం కుక్కలని తరలించామని, మిగిలిన వాటిని కూడా తరలించి గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని ఆ గ్రామ డెవలప్ మెంట్ ఫోరం సభ్యులు పేర్కొంటున్నారు. ఈ విషయం తెలిసినా మండల ప్రజలు ఆ గ్రామ డైవలప్ మెంట్ సభ్యులను అభినందించారు. మిగతా గ్రామాల్లోనూ కుక్కలను తరలించాలని కోరుతున్నారు.



వీధి కుక్కను పట్టుకుంటున్న దృశ్యం

రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతుల ముందస్తు అరెస్ట్



పోలీస్ స్టేషన్‌లో రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు, నాయకులు

గట్టుప్పల్ : సీపీఎం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా పోలీసులు రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులను, ఆ పార్టీ నాయకులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ టౌన్ కార్యదర్శి కర్నాటి సుధకార్, కర్నాటి వెంకటేశం, ముసుకు బుచ్చిరెడ్డి, ఖమ్మం రాములు, పెద్దగాని నరసింహ, బొబ్బలి చంద్రయ్య, రైతులు ఉన్నారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట సోమవారం రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు చేపట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా మండలంలోని మందోళ్లగూడెం, సింగరాయచెర్వు, కుంట్లగూడెం, నేలపట్ల గ్రామాలకు చెందిన పలువురు సీపీఎం నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి, పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు .

భగవాన్‌రెడ్డికి నివాళి

మునుగోడు : మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీపీఐ మండల కార్యదర్శి గంట్ల భగవాన్ రెడ్డి 9వ వర్ధంతిని ఆ గ్రామ సీపీఐ నాయకులు సామవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఆయన జ్ఞాపకార్థం నిర్మించిన స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పేదల ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు బొమ్మరబోయిన లాలయ్య, మండల నాయకుడు బండమీది యాదయ్య, గ్రామశాఖ కార్యదర్శి నందిపాటి అశోక్, పగిళ్ల యాదయ్య, గాలయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ల్యాండ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

చిట్యాల : ప్రజల పట్టా భూములను, అసైన్డ్ భూములను దౌర్జన్యంగా ఆక్రమిస్తున్న ల్యాండ్ మాఫీయాపై చర్యలు తీసుకోవాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంలో ల్యాండ్ మాఫీయా అక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం చిట్యాల తహసీల్దార్ క్రిష్ణనాయక్‌కు భూబాధితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అధికారులు ల్యాండ్ మాఫీయాపై చర్యలు తీసుకోకుండా భూబాధితుల హక్కులను అణచివేసే ప్రయత్నం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ల యాదయ్య, బైరు వెంకన్న, బర్రె సంజీవ, పురం రాంబాబు, ఉయ్యాల లింగస్వామి గౌడ్, రెడపాక విజయ్‌చందు, దేశపాక శ్రీరాములు, పెర్క ఈశ్వరయ్య, అర్రూరీ జంగయ్య పాల్గొన్నారు.

కంకర పరిచి.. వదిలేశారు

గట్టుప్పల్ : మండలంలోని అంతంపేట గ్రామం నుంచి రంగంతండా మీదుగా అంజనా తండా రోడ్డు పనులు మధ్యలోనే వదిలేశారు. 2023లోరూ. 1.75 కోట్ల నిధులు రోడ్డు నిర్మాణానికి మంజూరయ్యాయి ఆనాడే అధికారుల ఆదేశాల మేరకు కంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. రంగం తండా వరకు కంకర వేసి నిధులు రావడం లేదని పనులు ఆపేశారు. ఆనాటి నుంచి నేటి వరకు పనులు ముందుకు సాగడం లేదు. గిరిజనులు నిత్యం కంకరతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు నడవడం కష్టాంగా మారింది. ఇక వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయించాలని ఆ రెండు తండాల గిరిజనులు కోరుతున్నారు.



అంతంపేట నుండి రంగంతండాకు కంకర పరిచి వదిలేసిన రోడ్డు